ప్రజాశక్తి

ఆదివారం 25 ఆగస్టు 2024



నేటి నుంచి నేత్రదాన పక్షోత్సవాలు

కరపత్రాలను ఆవిష్కరించిన జెసి సేతుమాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో నేత్రదాన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కోరారు. ఆగస్టు 25నుంచి సెప్టెంబరు 8వ తేదీవరకు నిర్వహించే ఈ పక్షోత్సవాల్లో భాగంగా, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, నేత్రదానానికి ముందుకు వచ్చేలా వారిని చైతన్య పరచాలని సూచించారు. పక్షోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను తన ఛాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, కంటివైద్య నిపుణులు డాక్టర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ భట్లభద్ర

మన్యం జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. గ్రామాల్లో అపారిశుధ్యం కారణంగా దోమలు విజృంభించి జ్వరాల బారిన పడుతున్నారు. ఈనేపథ్యంలోనే జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీ భట్లభద్ర గ్రామంలో డెంగీ బారిన పడిన తల్లీకూతురు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.


- డెంగీతో తల్లీ కూతురు మృతి
- పది మంది వరకు జ్వరపీడితులు
- పారిశుధ్యంపై అధికారుల శీతకన్ను



మృతి చెందిన తల్లి మేరువ దుర్గ, కుమార్తె చైతన్య (ఫైల్)

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

భట్లభద్రలో గత పదిరోజులుగా పలువురు జ్వరాలతో బాధ పడుతున్నారు. గ్రామంలో అపారిశుధ్యం తాండవించడంతో జ్వరాలు బారినపడినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే గ్రామానికి చెందిన మేరువ పరంధామ భార్య మేరువ దుర్గ (47), కుమార్తె చైతన్య (20) డెంగీ జ్వరం బారిన పడ్డారు. కొద్ది రోజులుగా దుర్గ పార్వతీపురం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం విజయనగరం తిరుమల-మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ పరిస్థితి విషమించి శుక్రవారం వేకువజామున మృతి చెందింది. కుమార్తె చైతన్య పరిస్థితి కూడా బాగోలేకపోవడంతో శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఆమె కూడా పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్ర ప్రాణాలు విడిచింది. వీరిద్దరూ ఒకేరోజు కొద్ది గంటల సమయం తేడాలో మృతి చెందడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. వ్యవసాయం చేసుకుంటూ ఒక్కగానొక్క కుమార్తెను అల్లారుముద్దుగా పెంచుకున్నామని, ఇంజినీరింగ్ చదివిస్తున్నామని, భార్య, కుమార్తె చనిపోవడంతో తాను ఎవరి కోసం బతకాలని పరంధామా రోదిస్తున్న తీరు గ్రామస్తులను కలచివేసింది. చైతన్య విశాఖపట్నంలోని అవంతి కళాశాలలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతుంది. జ్వరం రావడంతో ఇంటికి వచ్చేసింది. తల్లికి కూడా జ్వరం రావడంతో ఇద్దరూ ఆస్పత్రిలో చేరి కన్నుమూశారు. ఇదిలా ఉండగా అదే గ్రామానికి చెందిన అల్లు వెంకట నాయుడు ఇటీవల డెంగీతో మతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం మరోపది మంది వరకు జ్వరాలతో బాధపడుతున్నారు.



రోదిస్తున్న పరంధామ



గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు

వర్షాకాలం ప్రారంభంతో జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు తమ సిబ్బందితో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ జ్వర పీడితుల సంఖ్య నానాటికి పెరిగి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. తాజా ఘటనతో సమాచారం తెలుసుకున్న మాదలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తనూజ స్థానిక పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించి వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే జ్వరం వస్తే కోలుకుంటామో లేదో అన్న పరిస్థితిలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆసుపత్రిలో మందులు, సిబ్బంది కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గ్రామాల్లో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ నేపధ్యంలోనే డెంగీతో మేరువ దుర్గ, తన కుమార్తె మేరువ చైతన్య మృతి చెందారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లోని పారిశుధ్యం మెరుగుపరిచి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అంగన్వాడీ భవనాలు అక్టోబర్ 2కు పూర్తి కావాలి

బాల్య వివాహాలపై అవగాహన పెంచాలి ● ఐసిడిఎస్ వంద రోజుల ప్రణాళిక సమీక్షలో కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రస్తుతం నిర్మాణంలో ఉండి స్లాబ్ లెవెల్ కు వచ్చిన అంగన్వాడీ భవనాలను పూర్తి చేసి అక్టోబర్ 2వ తేదీ నాటికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లాలో 259 అంగన్వాడీ భవనాలు ఉపాధి హామీ నిధులతో , 79 భవనాలు నాడు- నేడు కింద మొత్తం 285 నిర్మాణంలో ఉన్నాయని పంచాయతీ రాజ్ ఇఇ కలెక్టర్‌కు తెలపగా అందులో స్లాబ్ లెవెల్ లో ఉన్న 40 భవనాలను వంద రోజుల ప్రణాళిక కింద పూర్తి చేసి అక్టోబర్ 2 నాటికి ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. మిగిలిన భవనాలను ఎప్పటికి పూర్తి చేస్తారో యాక్షన్‌ప్లాన్ ఇవ్వాలని అన్నారు. అన్ని ప్రభుత్వ అంగన్వాడీ భవనాల్లో తాగు నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇకి సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఐసిడిఎస్ 100 రోజుల ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో అక్టోబర్ లోపల ప్రతి బాల బాలిక ఏదో ఒక పాఠశాలలోనే ఉండాలని, బడి బయట ఏ ఒక్కరూ ఉండకూడదని తెలిపారు. నెలలో ఒక్కసారి పాఠశాలల్లో , కళాశాలల్లో రక్త హీనత పై అవగాహన కలిగించాలని తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వం, ప్రైవేటు భవనాల వద్ద ప్రతి తల్లి పేరుతో మొక్కలు నాటాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ఇందుకోసం వంద రోజుల ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల వద్ద న్యూట్రి గార్డెన్లను పెంచడానికి అవకాశం ఉన్న చోట్లను గుర్తించి జాబితాలను ఇవ్వాలని, ఉద్యాన వన శాఖ ద్వారా న్యూట్రీ గార్డెన్ల ను పెంచడానికి శిక్షణ ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఇంజినీరింగ్, వైద్య, విద్యా, ఉద్యాన, అటవీ శాఖల అధికారులు, ఐసిడిఎస్ పిఒలు, విద్యుత్‌శాఖల అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పిఎం జన్‌మన్‌తో మౌలిక సదుపాయాలు

- పైలట్ ప్రాజెక్టు కింద 5 మోడల్ గిరిజన గ్రామాలు ఎంపిక
- సెప్టెంబరు మొదటి వారంలో మెగా ఈవెంట్
- జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమం ద్వారా కొన్ని ప్రత్యేక గిరిజన తెగల (పివిటిజి) అభివృద్ధికి, వారి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కోరారు. దీనికోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. గదబ తదితర అతి సున్నిత గిరిజన తెగలు నివసించే గ్రామాలు జిల్లాలో 52 వరకు ఉన్నాయని చెప్పారు. వీటిలో శృంగవరపుకోట మండలం కొత్తపాలెం, పుణ్యగిరి, వేపాడ మండలం గదబవలస, బాడంగి మండలం అకులకట్ట, తెర్లాం మండలం తమ్మయ్యవలస గ్రామాలను నమూనా గ్రామాలుగా ఎంపిక చేశామని తెలిపారు.

పలుశాఖల అధికారులతో జెసి తన ఛాంబర్‌లో శనివారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమం అమలులో భాగంగా ఆయా శాఖలు చేపట్టిన ప్రతిపాదనలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జెసి సేతు మాధవన్ మాట్లాడుతూ, అతిసున్నిత గిరిజన తెగల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని, దీనికోసం ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమం కింద ఈ తెగలు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేత్ మాధవన్

నివసించే గ్రామాల్లో విద్య, వైద్యం, ఆరోగ్యం, గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, విద్యుత్, పౌష్టికాహారం, రహదారులు తదితర మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. దీనికోసం ఆయా శాఖల అధికారులు ఈ 52 గ్రామాల్లో పర్యటించి, 15 రోజుల్లో ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ప్రధానంగా మోడల్ గ్రామాల సమగ్ర అభివద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంపై కలెక్టరేట్ ఆడిటోరియంలో మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నామని, దీనికి భారీ ఏర్పాట్లు చేయాలని జెసి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామానందం, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అదనపు భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్

విమానాశ్రయ అదనపు భూముల పరిశీలన

ప్రజాశక్తి- భోగాపురం

విమానాశ్రయం అదనపు భూములను విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ శనివారం పరిశీలించారు. విమానాశ్రయ నిర్మాణం కోసం 2700 ఎకరాలు భూ సేకరణ చేసిన విషయం తెలిసిందే. ఇందులో 2200 ఎకరాలు విమానాశ్రయానికి కేటాయించిన విషయం తెలిసిందే. మిగిలిన సుమారు 560 ఎకరాలు భూమిని గత ప్రభుత్వం అట్టిపెట్టుకుంది. విశాఖ జిల్లా సరిహద్దులో ఉన్న అన్నవరం నుంచి ప్రస్తుతం ఉన్న ఈ విమానాశ్రయ భూముల వరకు మధ్య ఎన్ని కిలోమీటర్లు దూరం ఉందో పరిశీలించారు. వీటికి సంబంధించిన మ్యాప్‌లను సర్వేయర్లు వివరించారు. కొంగ వానిపాలెం రెవెన్యూలో ఉన్న ఎపిఐఐసి భూముల్లో వేసిన లేఅవుట్‌ను కూడా పరిశీలించారు. ఈ ప్రాంతంలో 30 మీటర్ల పొడవున రోడ్డు వేసేందుకు ప్రణాళికలను పరిశీలించినట్లు తెలిసింది. తహశీల్దార్ ఎం.సురేష్, సర్వేయర్ మధుకేశ్వరరావు, రెవెన్యూ మరియు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

26న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విజయనగరంకోట :జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఈనెల 26న కృష్ణాష్టమి సందర్భంగా రద్దు చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఆరోజు ప్రజలెవరూ రావద్దని కోరారు.

కోర్టు కానిస్టేబుళ్ల విధులు క్రియాశీలకం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

వివిధ కేసుల్లో నిందితులకు శిక్ష ఖరారు కావడంలో కోర్టు కానిస్టేబుళ్ల క్రియాశీలకంగా వ్యవహరించాలని ఎస్‌పి వకుల్‌జిందాల్ సూచించారు. వివిధ పోలీసు స్టేషన్లలో కోర్టు కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, వివిధ కోర్టుల్లో సమన్వయ అధికారులుగా పని చేస్తున్న అధికారులు, సిబ్బందితో ఎస్‌పి శనివారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రస్తుతం వారు నిర్వర్తిస్తున్న కోర్టు విధులు, వివిధ కోర్టుల్లో విచారణలో ఉన్న కేసుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజూ ఆయా పోలీసు స్టేషనులకు సంబంధించిన కేసులు ఏ కోర్టుల్లో విచారణలో ఉన్నవి, ఏ కేసుల్లో ప్రాసిక్యూషన్ జరుగుతున్నాయి? ఆయా కేసుల్లో సాక్షులకు సమన్లు సక్రమంగా అమలు జరిగేలా, న్యాయ స్థానంలో సాక్ష్యం చెప్పేందుకు వారికి అవసరమైన సహాయ, సహకారాలను అందించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వివిధ న్యాయ స్థానాల్లో విచారణలో ఉన్న గంజాయి, పోక్సో, రేప్, హత్య కేసుల ప్రాసిక్యూషను సమయంలో సిఎంఎస్ సిబ్బంది సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు, బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐలు కెకెవి విజయనాథ్, ఎ.వి.లీలారావు, పలువురు సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

దండుమారమ్మ కల్యాణ మండపాన్ని ఆధునీకరిస్తాం

దేవీ దండుమారమ్మ కల్యాణ మండపాన్ని ఆధునీకరిస్తామని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. శనివారం కాలిఘాట్ కాలనీలోని మండపాన్ని ఎస్‌పి సందర్శించారు. అదనపు వసతుల కల్పనకు చేపట్టాల్సిన చర్యలు గురించి అధికారులతో చర్చించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునీకరించేందుకు అంచనా వ్యయాన్ని రూపొందించాలని ఆదేశించారు. ఆధునిక సౌకర్యాలతో పోలీసు సిబ్బందికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఎస్‌పి వెంట ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, ఎస్‌బి సిఐ కెకెవి విజయనాథ్, ఆర్‌ఐలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

లాటరీ ద్వారా హుదూద్ బాధితులకు ఇళ్ల కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని లంకాపట్నం ప్రాంతంలో నిర్మించిన హుదూద్ గృహ సముదాయం లోని 78 ఇళ్లకు సంబంధించి లాటరీ ప్రక్రియను నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం లబ్ధిదారుల సమక్షంలో నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖ, నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ లాటరీ ప్రక్రియలో వచ్చిన నెంబర్ల ఆధారంగా గృహాలను కేటాయించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, హౌసింగ్ డిఇ శ్రీనివాస్ మాట్లాడుతూ 2017లో హుదూద్ తుపానులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం ఈ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. మొత్తం 432 గహ సముదాయాలు నిర్మించగా వాటిలో 209 గృహాలను గతంలో లబ్ధిదారులకు అందించామన్నారు. మిగతా వారికి నేడు కేటాయించామని తెలిపారు.

అందుబాటులో 48,469 మెట్రిక్ టన్నుల ఇసుక

- ఒక్కరోజులో 59 ఆర్డర్లపై 924.5 టన్నులు సరఫరా
- అడిగిన వారందరికీ ఉచితంగా ఇసుక
- గనుల శాఖ డిడి సూర్యచంద్రరావు


ప్రజాశక్తి-విజయనగరం కోట

భవన నిర్మాణాలకు ఉచిత ఇసుక సరఫరా చేయడంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శనివారం ఉచిత ఇసుక కోసం ఆర్డర్‌లు వచ్చాయని వాటన్నింటిపై ఇసుకను సరఫరా చేయడం జరిగిందని గనులశాఖ ఉప సంచాలకులు సిహెచ్.సూర్యచంద్రావు వెల్లడించారు. జిల్లాలో శనివారం 20 మంది ఇసుక కోసం 59 ఆర్డర్‌లు చేయగా వారందరికీ 924.5 మెట్రిక్ టన్నుల ఇసుకను బొబ్బిలిలోని ఇసుక డిపో ద్వారా సరఫరా చేశామన్నారు. జిల్లాలో ఇప్పటికీ 48,469.5 మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు సరఫరా చేసేందుకు సిద్ధంగా వుందని పేర్కొన్నారు. నిర్వహణ ఛార్జీల కింద ఒక్కో టన్నుపై రూ.605 మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులకు ఇసుక సరఫరాను సులభతరం చేసేందుకు పలు చర్యలు చేపట్టామని యీ సందర్భంగా డిడి వెల్లడించారు. ఇసుక రవాణా చేసే వాహనాలను రిజిష్టర్ చేయించడం, రవాణా ఛార్జీలను ప్రకటించడం, బుకింగ్ ఇన్‌వాయిస్ లు వున్న వాహనాలను మాత్రమే ఇసుక రవాణాకు అనుమతించడం, ప్రత్యేక ఇసుక బుకింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి చర్యల ద్వారా ఉచిత ఇసుక అవసరమైన వారికి చేరేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

కుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని వెలగవలసలో కుల ధ్రువీకరణ పత్రాలను ఆర్‌డిఒ సుధారాణి శనివారం పరిశీలించారు. కుల గణన సమయంలో కుల ధ్రువీకరణ పత్రాలు లేని వారిని గుర్తించడం, వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కోసం వచ్చిన జాబితాలో వెలగవలస గ్రామంలో అత్యధికంగా గుర్తించడంతో ఆమె తనిఖీ చేశారు. జాబితాలోని లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, విఆర్‌ఒ గణపతి రావు, శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యుపిహెచ్‌సిలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

సీజనల్ వ్యాధులపై అవగాహన : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. శనివారం నగరంలోని సాయినాథ్ కాలనీ, సంతపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. వార్డు స్థాయిలో ఆశ, ఎఎన్ఎంలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అవసరమైన మందులు అన్ని యుపిహెచ్‌సిల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డెమోలాజిస్ట్ వెంకటేష్, సత్తిరాజు పాల్గొన్నారు.

27 నుంచి ఫార్మేటివ్ ఎసెస్మెంట్ పరీక్ష

విజయనగరం టౌన్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈనెల 27 నుంచి వచ్చేనెల 4వరకు ఫార్మేటివ్ ఎసెస్మెంట్ 1 పరీక్ష జరుగుతుందని డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. అన్ని పరీక్షా పత్రాలపై జిల్లా కోడ్ ముద్రించబడుతుందని, ఎక్కడైనా పరీక్షా పత్రాలు లీక్ అయినట్లయితే సంబందిత వ్యక్తులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామసభల మాటున సర్పంచులు టార్గెట్ కారాదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మహాత్మగాంధీ పేరు వింటే ఆయన కలలుగన్న గ్రామ స్వరాజ్యం గుర్తుకు వస్తుంది. బహుశా అందుకే 2005లో కమ్యూనిస్టుల మద్ధతుతో ఏర్పడిన యుపిఎ-1 ప్రభుత్వం కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని గాంధీ పేరున రూపకల్పన చేశారు. ఈ చట్టం ప్రకారం ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడంతోపాటు ఆయన ఆశించిన విధంగా గ్రామాల్లో చేపట్టబోయే పనులకు గ్రామ సభల ద్వారా ఆమోదం తప్పనిసరి చేశారు. ఈ సభలు పంచాయతీ సర్పంచి అధ్యతక్షన జరగాలి. తద్వారా గ్రామ స్థాయి నుంచి ప్రజాస్వామ్య పద్ధతులు నెలకొల్పాలన్నది కమ్యూనిస్టుల ఆకాంక్ష. సుదీర్ఘకాలంలో కేరళ రాష్ట్రంలో పాలన సాగించిన వామపక్ష ప్రభుత్వాలు స్థానిక సంస్థల ప్రత్యేకతలు, అధికారాలు, బాధ్యతలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ఈ సంగతి కాస్త అటుంచితే... గాంధీ పేరున ఏర్పాటైన ఉపాధి హామీ చట్టం అమల్లో భాగంగా పనుల ఎంపిక, ఆమోదానికి టిడిపి - జనసేన కూటమి ప్రభుత్వం గ్రామ సభలు తప్పనిసరి చేస్తూ పునరుద్ధాటించింది. ఈ పిలుపులో భాగంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అన్నిచోట్లా గ్రామసభలు నిర్వహించారు. అయితే, ఈసభల్లో తమను పక్కనబెట్టి గ్రామ సభలు నిర్వహించారని, టిడిపి, జనసేన నాయకుల



పెత్తనం కాస్త ఎక్కువైందని వైసిపికి చెందిన స్పంచలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతమాత్రాన గ్రామ సభలే సరికాదని చెప్పలేం. ఎందుకంటే గ్రామ సభ అనేతీ ప్రజాస్వామ్యంలో ప్రాథమిక బాధ్యత. ఆ సభల్లో సర్పంచులను భాగస్వామ్యం చేయడం కూడా అంతే కర్తవ్యం. ఈ పద్ధతి పాటించడం లేదన్నది వైసిపి మద్ధతుగావున్న సర్పంచులు, ఇతర నాయకుల వాదన. గ్రామాల్లో రాజకీయంగా, ఆర్థికంగా అనగదొక్కేందుకు, అవమానించేందుకే ఈ గ్రామ సభలు పెడుతున్నారని కూడా మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఇప్పటికే పనులన్నీ గ్రామ సభ తీర్మాణ్రంతోనే చేపడుతున్నారు. కాకపోతే సభలు నిర్వహించకుండా, పెత్తందారులు, లేదా సర్పంచి, ఫీల్డ్ అసిస్టెంట్ల ఇష్టారాజ్యంగా తీర్మాణ్రముఖ రాసేసి అమలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామ సభలు మంచివైనప్పటికీ గడిచిన ఐదేళ్లూ వైసిపి మద్దతుదారులు చేసిన తప్పులనే నేడు టిడిపి - జనసేన ప్రభుత్వాలు చేయడం వల్ల ఉపయోగం లేదన్నది పబ్లిక్ టాక్. పనుల ఆమోదంలోనే ఇంతలా రాజకీయాలు పెచ్చుమీరితే గ్రామాల్లో చేసిన పనిబట్టి భవిష్యత్తులో మెటీరియల్ కాంపొనెంట్ పనులు కూడా జరుగుతాయి. వీటి కేటాయింపులో కూడా సర్పంచులు జోక్యం లేకుండా కేటాయింపులు జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే విజయనగరం జిల్లాల్లో రోడ్లు, కాలువలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు రూ.208కోట్లు సిద్ధంగా ఉన్నాయని, వీటిని వెండార్ పేరిట టిడిపి, జనసేన నాయకులకు కట్టబెట్టుకునేందుకే గ్రామసభల పేరిట గ్రామాల్లో పెత్తనం చలాయించేందుకు ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని వైసిపి నాయకులు. అదే పార్టీకి చెందిన సర్పంచుల వాదన. ఆచరణ ఎలా ఉంటుందో కొద్దిరోజుల్లోనే తేలిపోతుందని పలువురు చర్చించు కుంటున్నారు.



కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి

డిగ్రీ కళాశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

విజయనగరం టౌన్ : నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న విద్యా విధానం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాల మరింత అభివృద్ధి చెందేందుకు, విద్యార్థులకు మరింత మంచి భవిష్యత్ ఇచ్చేందుకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ డిఇఒ వెంకటరమణ, ఎంఇఒ సత్యవతి, డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లా అథ్లెటిక్స్ జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ :వచ్చే నెల 14 15 16 తేదీల్లో గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరుగు రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక ఈనెల 25వ తేదీ ఉదయం 9 గంటల నుండి జరుగుతుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి లీలా కుమార్ తెలిపారు. ఎంపికలో పాల్గొనేందుకు 14, 16, 18, 20 ఏళ్ల వారు అర్హులని తెలిపారు. 16 ఏళ్ల వయసు గలవారు తహశీల్దార్ నుంచి వయసు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు

జిల్లాలో లక్ష మొక్కలు నాటుతాం : డిఎఫ్ఒ



మొక్కలు నాటే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఎఫ్ఒ

నెల్లిమర్ల: జిల్లాలో 100 హెక్టార్లలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని అటవీశాఖ జిల్లా అధికారి ఎస్.వెంకటేష్ తెలిపారు. శనివారం కొత్తపేట, దమర సింగి రిజర్వ్ ఫారెస్ట్ విభాగంలో కొత్త పేట వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఒ వెంకటేష్ మాట్లాడుతూ అటవీ పరిరక్షణకు 21 జాతుల మొక్కలు నాటడం, సామాజిక వనాల వద్ద ట్రెంచ్ లు ఏర్పాటు చేసి నీటి సంరక్షణ చేపట్టడం జరుగుతుందన్నారు. అటవీ సంపదను కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. అప్పల రాజు, ఫారెస్ట్ డివిజన్ రేంజ్ ఆఫీసర్ కె.వి.ఎస్.రాజు పాల్గొన్నారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

బొండపల్లి: యువత భవిష్యత్తు దృష్ట్యా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నామని ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో 26వ నెంబర్ జాతీయ రహదారిపై ఆయన ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేశారు. ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ దేశానికి భవిష్యత్తు యువతే అని అలాంటి యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం ద్వారా తమ జీవితాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కుప్పానాయుడు వర్థంతి సభకు తరలిరండి

మెంటాడ: వ్యవసాయ సంఘం కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పీడిత వర్గాల ప్రయోజనం కోసం పోరాడిన కమ్యూనిస్టు మాస్టారు డాక్టర్ ఆర్ కుప్పానాయుడు 13వ వర్ధంతి ఈ నెల 27న మెంటాడలో నిర్వహిస్తామని, ఈ సభకు తరలి రావాలని ఏపీ కౌలు రైతుల జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు పొంచాల రాములమ్మ, మంగళగిరి అప్పల నరసయ్యలు తెలిపారు. మెంటాడ ఎస్సీ కాలనీలో ఉదయం 10గంటలకు మండల మహాసభ నిర్వహించ నున్నామని చెప్పారు. కామ్రేడ్ ఆర్ కుప్పా నాయుడు అనేక రంగాలలో దళిత, గిరిజన, పేదల, రైతుల, కార్మికుల పక్షాన అలుపెరగని పోరాట పటిమ నెలకొల్పిన మహనీత అని అటువంటి వ్యక్తి వర్థంతి సభ, మహా సభకు కార్మికులు, దళిత, గిరిజనులు, హాజరు కావాలని కోరారు.

జెసి రాజుకు మదర్ థెరిస్సా అవార్డు

బొబ్బిలి: గత 50 సంవత్సరాలుగా భాష, సాహిత్య, సామాజిక సేవా రంగాలలో బహుముఖ సేవలందిస్తున్న విజయవాడకు చెందిన ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ బొబ్బిలికి చెందిన ప్రముఖ సమాజ సేవకులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజుకు వివిధ రంగాలలో సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ మదర్ థెరిస్సా అవార్డుకు ఎంపిక చేసింది. ఈ విషయాన్ని ఎక్సరే సంస్థ శనివారం తెలియజేసినట్లు జెసి రాజు తెలిపారు. ఈ అవార్డును ప్రముఖుల చేతుల మీదుగా విజయవాడలో హనుమంతరాయ గ్రంథాలయంలో మదర్ థెరిస్సా జయంతి రోజు ఈ నెల 26న ప్రదానం చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

కొంప ముంచిన డి -పట్టా భూముల వ్యవహారం

వేపాడ: డి పట్టా భూముల వ్యవహారం ఎస్కోట సబ్ రిజిస్ట్రార్ శ్యామల కొంప ముంచాయి. ఇష్టానుసారంగా డి పట్టా భూములను రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలతో ఆమెను సస్పెండ్ చేశారు. మండలంలోని కేశీపురం రెవెన్యూ పరిధిలో గల 224.95 ఎకరాలు ఫ్రీహోల్డ్ అన్న భూమిలో 210.11 ఎకరాలకు డి నోటిఫికేషన్ వచ్చింది. ఇందులో నుంచి ఇటీవల ఎస్కోట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో 98.32 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేసేశారు. వీటిలో 4.82 ఎకరాలకు సంబంధించి జరిగిన అవకతవకల కారణంగా ఎస్కోట సబ్ రిజిస్ట్రర్ శ్యామల సస్పెన్షన్ కు గురయ్యారు. ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి తహశీల్దార్ వివరణ కోరగా మండలంలోని 916.93 ఎకరాలు ఫ్రీహోల్డ్ భూములకు దరఖాస్తులు రాగా 331.43 ఎకరాలలో ఫ్రీహోల్డ్ ఉందని ఇందులో 299.22 ఎకరాలకు డి నోటిఫికేషన్ వచ్చిందని చెప్పారు.

గుంత పూడ్చివేత

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం శిరిడి సాయి ఆలయ సమీపం పాలకొండ-రాజాం ప్రధాన రహదారికి పెద్ద గుంత ఏర్పడి, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారని ప్రజాశక్తిలో ఈనెల 21న గుంతను పూడ్చండి అనే కథనానికి సంకిలి గ్రామ సర్పంచ్ బుడుమూరు పట్నాభి స్పందించారు. ఈ ప్రధాన రహదారికి పెద్ద గుంతకు సొంత నిధులు సమకూర్చి సిమెంటు, రాయి కలిపిన కాంక్రీటును వేయించి, తన ఉదారతను చాటుకున్నారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉదార భావంతో దాతలు నగుడు జ్యోతి, విఐఎ తొండపరపు సురేష్ ఆర్థిక సహాయంతో జామెంట్రీ బాక్స్, డైరీలు శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.బాల భాస్కరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట సత్యనారాయణకు డాక్టరేట్

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన శిరపురపు వెంకట సత్యనారాయణకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో తత్వ శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి శిరపురపు వెంకట సత్యనారాయణకి వర్సిటీ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ బుంగ రవిబాబు పర్యవేక్షణలో 'వాల్యూ ఓరియంటెడ్ ఎడ్యుకేషన్ విత్ రిఫరెన్స్ టూ ఇండియన్ కాంటెంపరరీ థింకర్స్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశి భూషణ్ రావు డాక్టరేట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. నరసింహారావు డాక్టరేట్ ఉత్తర్వులు అందజేశారు.

గంబుషియా చేపలు విడుదల

బొబ్బిలి: దోమల లార్వా నిర్మూలించడంలో భాగంగా బొబ్బిలి పురపాలక సంఘ పరిధిలో గల రాణి మల్లమ్మదేవి కోనేరులో గంబుషియా చేపలను శనివారం కమిషనర్ ఎల్ రామలక్ష్మి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి శానిటరీ, పర్యావరణ ఇంజనీర్, బొబ్బిలి మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది ఎంఎస్ఎయు. బి. జలరాం నాయుడు, ఎంపిహెచ్ ఎస్. రాంబాబు, ఎంపిహెచ్ఎ ఈ.పైడపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించండి

బొబ్బిలిరూరల్: మండలంలో ఆదివారం నుంచి జరగనున్న సామాజిక తనిఖీకి ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపిడిఒ రవి కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులు, ఎంపిటిసిలు, ఉపాధి హామీ సిబ్బంది, మండల ఇంజనీరింగ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామాల్లో చేసిన ప్రభుత్వ పనులపై తనిఖీ నిర్వహిస్తారని ఈ తనిఖీలో గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిధులు పాల్గొని తనిఖీ బృందానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సిసిపై చర్యలు తీసుకోవాలి

శృంగవరపుకోట: వెలుగు సిసి మూర్తి పై చర్యలు తీసుకోవాలని మండలంలోని వసి గ్రామం వెలుగు విఓఎ గుడివీ భ్రవణి మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కి శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా వెలుగులో విఓఎగా సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నానని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తనకు తెలియకుండా తన స్థానంలో వేరే మహిళను విఓఎగా నియమించారని, శనివారం సిసి మూర్తి వసి గ్రామంలోని తమ ఇంటికి వచ్చి తనను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా తన దగ్గర ఉన్న రికార్డులను తీసుకువెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే సీసీపై చర్యలు తీసుకోవాలని భర్త రామకృష్ణతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

విజయనగరంటౌన్ : విద్యార్థి దశనుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని వలువురు వక్తలు అన్నారు.జన విజ్ఞాన వేదిక, గాంధీ క్లబ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యాన మూఢ నమ్మకాల నిర్మూలనలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై శనివారం మహారాజ జూనియర్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు మాట్లాడుతూ మూఢ నమ్మకాల నిర్మూలనలో విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు. మూఢ నమ్మకాల బారి నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సింహాచలం నాయుడు మాట్లాడుతూ అక్షరాస్యతతో మూఢ నమ్మకాలను అరికట్టవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గాంధీ క్లబ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్ తదితరులు మాట్లాడారు.

అధికార పార్టీలో చేరితే అంతా సక్రమమే

●అలమండ సంత అనుమతుల మంజూరుకు సన్నద్ధం ● కానరాని సౌకర్యాలతో తప్పని అవస్థలు

ప్రజాశక్తి - జామి

నిన్నటి వరకూ అక్కడ సదుపాయాలు కరువు. పశువుల సంత నిర్వహణకు తగిన ఏర్పాట్లు లేవు. తాగునీరు లేదు.. సిసి కెమెరాలు కానరావు. కానీ నేడు అన్ని సక్రమం అయిపోయాయి. సంత నిర్వహణకు అనుమతులు ఇచ్చేసేందుకు అధికారులు సిద్ధమైపోయారు. ఏంటి ఈ మార్పు అనుకుంటున్నారా..? కేవలం అధికార పార్టీలో చేరిపోవడమే దీనికి కారణం.. టిడిపి తీర్థం పుచ్చుకున్న వెంటనే.. అక్రమం అయినవన్నీ సక్రమం అయిపోయాయి. మండలంలోని అలమండ పశువుల సంతకు రాష్ట్రంలోనే ప్రత్యేకత ఉంది. ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడే అలమండ పశువులు సంత పూర్వం నుంచి ప్రయివేటు వ్యక్తులే నిర్వహిస్తున్నారు. లోట్లపల్లి పంచాయతీ పరిధిలోని అలమండ సంతపై ఆధిపత్యం చేలాయించేది, తొలి నుంచి రాజులే. కానీ గతంలో పంచాయతీ అనుమతులు పొందినప్పటికే, గత వైసిపి ప్రభుత్వంలో అనుమతులు నిరాకరించారు. దీంతో గత ఏడాదిగా అనుమతులు కోసం అనేక ప్రయత్నాలు చేసి, విఫలమయ్యారు. తాజాగా అధికార టిడిపిలోకి చేరడంతో, ఒక్కసారిగా సంత నిర్వహణపై విమర్శలు చేసిన వారంతా సైలెంట్ అయిపోయారు. ఈ నేపథ్యంలోనే తహశీల్దార్ నేతృత్వంలో శనివారం మోనటరింగ్ కమిటీ అనుమతుల మంజూరుకు సిద్ధమైంది. కానీ పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో సమావేశం వాయిదా పడింది. ఈ కార్యక్ర మంలో మండల పంచాయతి విస్తరణ అధికారి శ్రీదేవి, వెహికల్ ఇన్స్పెక్టర్ వి.శ్రావ్య, లోట్లపల్లి సర్పంచ్ జన్నెల సింహా చలం, పంచాయతీ కార్యదర్శి రొంగళి ఎర్నమ్మ, సంత నిర్వాహ కులు పి.రమణరాజు, లొట్లపల్లి పశుసంవర్ధక శాఖ సహా యకులు యస్.లక్ష్మి, గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేదర శెట్టి, రామసత్యనారాయణ, జిల్లా మహిళ కన్వీనర్ చింతలపూడి రూపవతి, సమాఖ్య నాయకులు పి.నాని, జి.అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ కృష్ణలత

సంతలో సదుపాయలు కల్పించాలి

లోట్లపల్లి సంతలో పశువులకు అన్ని రకాల సదుపాయలు ఉంటేనె లైసెన్స్ మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అన్నారు. హై కోర్ట్ ఆదేశాలు, ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి జంతువులు, పశువులు సంతల్లో సౌకర్యలు కల్పించేటట్లు చర్యలు చేపట్టాలన్నారు.

మిగులు సీట్లు భర్తీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో మిగులు సీట్లు భర్తీ చేయనున్నామని ప్రిన్సిపాల్ కె.ఉషారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5,6,8,9 తరగతులు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో (సిఇసి) ఎస్సీ, ఎస్టికు చెందిన మిగుల ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 29న సాయంత్రం 4 గంటలలోపు సంబంధిత ధ్రువ పత్రాలను తీసుకుని పాఠశాలలో సమర్పించాలని ధ్రువపత్రాలను పరిశీలించి అడ్మిషన్ పొందవచ్చున్నారు. ఎస్సి, ఎస్టిలకు 5వ తరగతిలో 21, 6వ తరగతిలో 4, 8వ తరగతిలో 4, 9వ తరగతిలో 1, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 60 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. కాగా తల్లిదండ్రి, స్టూడెంట్ ఆధార్ కార్డులు, టిసి, స్టడీ, కులం, ఆదాయ ధ్రువ పత్రం, రేషన్ కార్డు, ఇంటర్కి పదవతరగతి మార్క్ మెమో 2023-2024వ సంవత్సరం ఉత్తీర్ణులయి వుండాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

అన్నదాతల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - రామభద్రపురం

అన్నదాతల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల పరిధిలోని కోటశిర్లాం, పాడివానివలస గ్రామాల్లో ఏడొంపులగెడ్డపై నిర్మించాల్సిన చెక్ డ్యాంలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇరిగేషన్ పనుల నిర్మాణాలు పారదర్శకంగా, పక్కాగా ఉండాలని, నీటి ప్రవాహాన్ని అదుపుచేసే విధంగా కాంక్రీటు పనులు చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషనన్ పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రైతులకు సాగునీరు అందకుండా పోయిందని, దీని వల్ల వేలాది ఎకరాలు బీడు భూమిగా మారిపోయాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నదుల అనుసంధానానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా చెరువులు ఇంటర్ లింక్ చేయడం ద్వారా రైతన్నలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కోటశిర్లాం గ్రామంలోని జంతిగెడ్డ వద్ద నిర్మించాల్సిన చెక్డ్యాం ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ నిర్మించాల్సిన చెక్ డ్యాం వల్ల కొత్తరేగ, దుప్పలపూడి, కోటశిర్లాం గ్రామాల రైతులకు సాగునీరు అందుతుందని దీని కోసం సుమారు రూ.50లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందని ఇరిగేషన్ ఎఇఇ హరిబాబు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం పాడివానివలస గ్రామంలో ఉన్న కోనేటి గెడ్డను పరిశీలించి రైతులతో మాట్లాడారు. లస్కర్లు లేకపోవడం వల్ల నిర్వహణ ఇబ్బందిగా ఉందని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. ఇరిగేషన్ పనుల నిర్మాణాల్లో రైతులు కూడా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ ప్రాంతంలో నిర్మించాల్సిన చెక్ డ్యాంల వివరాలను ప్రతిపాదనలు చేసి అందించాలని బేబీనాయన ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా ఏడొంపుల గెడ్డపై ఎక్కువగా చెక్ డ్యాంలు నిర్మిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, నాయకులు కనిమెరక శంకరరావు, తాడ్డి శ్రీనివాసరావు, ఇరిగేషన్ వర్కు ఇన్స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

విఆర్ఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొండపల్లి

తమ సాగులో ఉన్న డీ-పట్టా భూములను స్వతంత్రంగా అనుభవించే భూమి (ఫ్రీ హోల్డ్)గా పాస్ పుస్తకాలు ఇస్తామని డబ్బులు తీసుకొని మోసం చేసిన కనిమెరక గ్రామ ఇంఛార్జి విఆర్ఒ డి.రవి పై తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బోడసింగిపేట గ్రామానికి చెందిన బోడసింగి రాము, బోడసింగి పెంటయ్య, బోడసింగి ఆదినారాయణ, బంక గౌరి, జామి అప్పన్న, జామి పట్టాలు తదితర రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకులు నుంచి కనిమెరక రెవెన్యూ పరిధిలో ఉన్న డీ-పట్టా భూములను సాగుచేస్తున్నామని విఆర్ఒ రవి సాగు చేసిన భూములకు స్వతంత్రంగా అనుభవించే భూమిగా పట్టా పాసుపుస్తకాలు ఇప్పిస్తానని తమ వద్ద నుంచి డబ్బులు వసూల్ చేసారని ఆరోపించారు. పాస్ పుస్తకాలు విషయమై గత ప్రభుత్వ హయాం నుంచి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ విఆర్ఒ తిప్పుతున్నారని, పాస్బుక్లు మాత్రం ఇవ్వడం లేదని చెప్పారు.

కనిమెరక గ్రామానికి చెందిన నీలాతి బంగారయ్య, నీలాతి గంగులు, గొగ్గ శ్రీను, పెంకి గౌరి తదితరులు మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల మరణ, జనన ధ్రువ పత్రాలు, కుటుంబ సభ్యులు ధ్రువ పత్రాలు మంజూరుకు విఆర్ఒ రవి తమ దగ్గర నుండి రూ.2వేలు, రూ.8వేలు వసూలు చేశారని, అయినప్పటికీ పత్రాలను మంజూరు చేయలేదని ఆరోపించారు. విధి నిర్వహణలో అనేక అక్రమాలకు పాల్పడుతున్న విఆర్ఒపై చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ రాజేశ్వరరావు మాట్లాడుతూ రైతులను మోసం చేసిన విఆర్ఒ రవికి మెమో జారీ చేస్తామన్నారు. శాఖ పరమైన విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

వికె ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- బాడంగి

వికె ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు లేని పిల్లలకు వసుధైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ట్రస్ట్ సమకూర్చిన సైకిల్స్, స్కాలర్షిప్లను ఎమ్మెల్యే చేతులు మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కలికాలంలో ఇతరులకు సాయపడే గుణం ఉన్నవారు కొందరే ఉంటారని దానికి ఉదాహరణగా ఎక్కడో అమెరికాలో ఉన్న వ్యక్తి వికె ట్రస్ట్ ద్వారా బాడంగి పాఠశాల అనాథ విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి నెలవారీ స్కాలర్షిప్ రూపంలో 15 మంది అనాథ విద్యార్థులకు ఆర్థికంగా సాయం చేయడం గొప్ప విషయమన్నారు. దూరప్రాంత విద్యార్థులకు గతంలో 15, ఇప్పుడు మరో 13 సైకిల్స్ అందించటం ఎంతో ప్రశంసనీయమన్నారు. ఆ ట్రస్టు మరిన్ని సేవలను ఈప్రాంత పిల్లలకు అందించాలని కోరారు. ఈ ట్రస్ట్ సాయం అందించడంలో ముఖ్య భూమిక పోషించిన ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావుని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి భాస్కరరావు, సర్పంచ్ కె రమేష్, ఎంపిటిసిలు శ్రీను, పార్టీ నాయకులు తెంటు రవిబాబు, పాలవలస గౌరు, హెచ్ఎం సత్యనారాయణ, ఎంఇఒ లక్ష్మణదొర, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలే ధ్యేయం : ఎస్ఐ

ప్రజాశక్తి - రామభద్రపురం



ఎస్ఐ ప్రసాద్

శాంతిభద్రతల పరిరక్షణ ప్రధాన కర్తవ్యమని వీటికి విఘాతం కల్పించే వారిపై కఠిన చర్యలు తప్పవని నూతన ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానాన్ని అవలంబిస్తామన్నారు. గ్రామాల్లో కక్షలు విడనాడి చట్టాలకు విధేయులుగా ఉండాలన్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనకు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి పుష్ప గుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ అప్పారావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా సాగర్బాబు బాధ్యతలు స్వీకరణ

తెర్లాం: స్థానిక ఎస్ఐగా బి. సాగర్ బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను స్టేషన్ సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు. పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

రేగిడి ఎస్ఐ శ్రీనివాసరావుకు బదిలీ

రేగిడి: స్థానిక ఎస్ఐ పనిచేసిన శ్రీనివాసరావు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్కు బదిలీ అయ్యారు. ఈయన రెండేళ్లపాటు ఇక్కడ ప్రజలకు సేవలందించారు. శాంతి భద్రతలు అదుపులో ఉంచారు. కేసులు సత్వర పరిష్కారం చేశారు. విద్యార్థులకు డ్రగ్స్పై, దిశ చట్టంపై అవగాహన కల్పించారు.

జెఎన్టియులో సదస్సు

విజయనగరం టౌన్ : జెఎన్టియు గురజాడ విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన ప్రొఫెసర్ ప్రసాద్ పట్నాయక్ ఐఐటి మద్రాసు ద్వారా సి ఎఫ్ డి- బేస్డ్ మోడలింగ్ ఆఫ్ మెకానికల్ సర్క్యులేటరీ సపోర్ట్ సిస్టమ్స్ ఫర్ ది హ్యూమన్ బాడీ' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్, బయో మెడికల్ ఇంజినీ రింగ్లో ప్రఖ్యాత నిపుణుడు ప్రొఫెసర్. ప్రసాద్ పట్నాయక్ ఆప్టిమైజేషన్లో సి ఎఫ్ డి- ఉపయో గంపై వివరించారు. ఈ వ్యవస్థలు తీవ్రమైన గుండె వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు తాత్కాలిక సహాయాన్ని అందించడంలో కీలకమైనవని, విఫలమైన గుండె పనితీరుకు సహాయం చేయడానికి లేదా భర్తీ చేయడానికి రూపొందించారని తెలిపారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎం.బూర్జవలసలో నిరసన తెలిపారు. పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు పాటించపోవడం వల్లనే ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.గోపాలం అన్నారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

గరివిడి: విశాఖ జిల్లా అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదానికి కారణమైన యాజమాన్యాన్ని శిక్షించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు నాయకులు టీవీ రమణ ఆధ్వర్యంలో గరివిడి ఫామ్ ఆయిల్ కంపెనీ వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీవీ రమణ మాట్లాడుతూ ఎల్జి పాలిమర్స్ ప్రమాదం జరిగిన తరువాత కూడా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ప్రమాదం జరిగి మూడు రోజులు అవుతున్న జమాన్యాన్ని అరెస్టు చేయకుండా ఎందుకు రక్షిస్తున్నారని ఆగ్రహించారు. 18 మంది కార్మికుల నిండు ప్రాణాలు బలికావడానికి మరో 45 మంది తీవ్రంగా గాయాల పాలవడానికి కారణమైన యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమంలో కార్మికులకు భద్రత, రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంబల్ల గౌరినాయుడు, మైన్స్ నాయకులు కరణం సన్యాసినాయుడు, పిసిని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గరివిడి: నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

బదిలీ ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి - భోగాపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒగా పనిచేస్తు బదిలీపై వెళ్లిన చంద్రకళను మండల పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వచ్చిన ఆరు నెలల్లో మండల అభివృద్ధికి ఆమె ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఎంపిపి సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మహిళ అధికారి అయినప్పటికీ పెన్షన్ల పంపిణీ, ఇతర కార్యక్రమాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపి జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపిడిఒ అవార్డు అందుకోవడం గొప్ప విషయమన్నారు. ఎంపిడిఒ అప్పలనాయుడు, మండల విద్యాశాఖాధికారులు రమణమూర్తి, చంద్రమౌళి, ఏవో బంగారయ్య, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎం రమణ తదితరులు ఆమె మండలానికి చేసిన సేవలు గురించి కొనియాడారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందర హరీష్, సర్పంచులు బైరెడ్డి రమణ, అప్పురభుక్త పైడినాయుడు, ఇఒ మొంగం సురేష్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.



చంద్రకళను సత్కరిస్తున్న నాయకులు

పత్తి పంట పరిశీలన

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని గొల్లాదిలో ఎఒ కె.శిరీష శనివారం పత్తిపంటను పరిశీలించారు. రసం పీల్చే పురుగులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసం పీల్చే పురుగులు నివారణకు ఫిప్రోనిల్ 0.4 గ్రాములు లీటర్కి చొప్పున కలిపి పత్తి పంట వెనుక వైపు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. మొదటి దఫగా కాంప్లెక్స్ ఎరువు 50 కేజీలు ఎకరానికి వేసుకోవాలన్నారు. అక్కడి నుంచి ప్రతి 20 రోజులకు ఒకసారి 30 నుంచి 35 కేజీల యూరియా, 10 నుంచి 15వ కేజీల పొటాష్, నాలుగైదు సార్లు వేసుకుంటే మంచి కాపు కాస్తుందన్నారు. అనంతరం వరి లైన్ ఉడుపు పద్ధతిని పరిశీలించారు. ఇ-పంట నమోదు పరిశీలించి ప్రతి రైతు తప్పనిసరిగా ఇ పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

దబ్బిరాజుపేటలో పొలంబడి

వేపాడ: మండలంలో దబ్బిరాజుపేట గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్ సెంటర్ వ్యవసాయ ఉపసంచాలకులు భారతి మాట్లాడుతూ పొలంబడి అనేది 14 వారాలలో నిర్వహించాలన్నారు. పొలం బడిలో వివిధ రకాల సస్యరక్షణ చర్యలు గురించి, పురుగులు, తెగుళ్లను గుర్తించి వాటికి నివారణ చర్యలను సూచిస్తామన్నారు. పంటకు సంబంధించిన వేసవి దుక్కులు, విత్తన శుద్ధి, నారు శుద్ధి, సుడోమోనోస్తో చేయాలని, చిగుర్లు తుంచుటం, కాలి బాటలు తీయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రైతులందరూ గట్లపై మొక్కలు వేసి ఏ గ్రేడ్ విధానాన్ని అవలంబించాలని తెలిపారు. ఎటిఎం మోడల్లో ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతి, తీగజాతికి సంబంధించిన అన్ని రకాల పంటలను వేసి అందులో నుంచి నిరంతరం ఆదాయం తీసుకునే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస డివిజన్ వ్యవసాయ ఉపసంచాలకులు ఎల్.విజయ, ఎఒ సిబి.యశ్వంత్రావు, ఎఇఒ ఎస్.రమేష్, అక్కు నాయుడు, ఎమ్టిఎల్ వసంత, సభల, లక్ష్మణ నాయుడు రైతులు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జామి

మండలంలోని కలగాడ గ్రామంలో ఓ వ్యక్తి పాము కాటు గురై అక్కడికక్కడే మరణించాడు. కలగాడ గ్రామానికి చెందిన దాకమర్రి సింహాచలం (44) ప్రతిరోజు ఎల్.కోట మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద పనికి వెళ్లి వస్తూ ఉంటాడు. ఎప్పటిలాగే శనివారం ఆయన భార్య మధ్యాహ్న భోజనం క్యారేజ్ రెడీ చేసి పనిలోకి వెళ్లిపోయింది. సింహాచలం గ్రామ సమీపంలోని యాళ్ల జగన్నాథం మామిడి తోటలో పుట్టకొక్కు కోసం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో పని నుంచి ఇంటికి వచ్చిన ఆయన భార్యకు క్యారేజ్ అలాగే ఉండడం చూసి అనుమానంతో చుట్టుపక్కల ప్రాంతాలలో వెతకడం ప్రారంభించింది. చివరకు ఓ మామిడి తోటలో పాము కాటు గురై మరణించినట్లు గుర్తించారు. వెంటనే స్థానికులు సింహాచలంను జామి పిహెచ్సికి తరలించగా అప్పటికే ఆయన మరణించినట్లు ధ్రువీకరించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

తైక్వాండో విజేతలకు ఎమ్మెల్యే అభినందన


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 18, 19, 20 తేదీలలో ఔరంగాబాద్లో జరిగిన 41వ జాతీయస్థాయి జూనియర్ తైక్వాండో పోటీలలో కాంస్య పతకం సాధించిన వారణాసి హిమశ్రీని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్గజపతిరాజు అభినందించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి హిమశ్రీ అండర్-52 కేజీల విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు డివి చారి ప్రసాద్, కోచ్ రవి, కస్పా స్కూల్ పిఇటి సౌదామని ఎమ్మెల్యేను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. హిమశ్రీ స్థానిక మున్సిపల్ కస్పా హైస్కూల్లో పదో తరగతి చదువుతూ విజ్జి స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్నది. గతంలో ఖేలో ఇండియాలో సౌత్ వెస్ట్ లీగ్లో కాంస్య పతకం, గత ఏడాది కేడెట్ నేషనల్ రజిత పతకం, గత ఏడాది అండర్ 19 స్కూల్ గేమ్స్లో కాంస్య పతకం సాధించి జిల్లాకు రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారని డివి ప్రసాద్ తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫోర్టు సిటీ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ప్రీప్రైమరీ నుంచి 2వ తరగతి చదువుతున్న విద్యార్థులు శ్రీకష్ణుడు, గోపిక, మీరాబాయి వేషాధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. మిగిలిన తరగతి విద్యార్థులకు సంగీతం, నృత్యం, వక్తత్వం, వ్యాసరచన తడితర విషయాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల చైర్మన్ కెవిపి రాజు (శివ) మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో కృష్ణుని ప్రత్యేకత వేరని అన్నారు. కృష్ణుడి జన్మదినం అంటే మన ఇంట్లో మనిషి పుట్టినరోజు అన్నంత ఘనంగా నిర్వ పొంచుకుంటామని అన్నారు. పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్ నీలమా తదితరులు పాల్గొన్నారు.



ఫోర్టు సిటీ స్కూలులో వేశధారణలో విద్యార్థులు

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

శృంగవరపుకోట: ఈ నెల 26న జరగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మండలంలోని భవాని నగర్ వద్ద గల డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్, పట్టణంలోని నారాయణ పాఠశాల, సర్వేపల్లి విద్యానికేతన్ తదితర పాఠశాలల్లో ముందుగా శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో అందరినీ అలరించారు. విద్యార్థులు నృత్య, నాటక, గేయాల రూపంలో శ్రీకృష్ణుని కథలను అందరికీ వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు

విజయనగరం కోట : భారతీయ సాంస్కృతి సాంప్రదాయాలతో కూడిన పండగల విశిష్టతను విద్యార్థులకు తెలపాలని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు అన్నారు. శనివారం గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా పిల్లలు శ్రీకృష్ణుడు సత్యభామ గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టు కొట్టిన సన్నివేశం ఎంతో ఆసక్తిగా సాగింది. అనంతరం నారాయణరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు, విలువలకు నిలువుటద్దం పండగలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.